

# గోదావరి మారిచిపోయిన్

ధవళేశ్వరం దాటి ఒక మైలుదూరం వెళ్లిన దగ్గరనుండీ నాన్నకళ్లు కుడివైపే తిరుగుతున్నాయి మాటిమాటికీ. ఒకచోట కారు ఆపమని ఆయన డ్రైవరుకు సైగ చేశారు. రోడ్డుకు ఎడమ ప్రక్కగా కారు ఆపి దిగి అటునుంచి వచ్చి నాన్న కూర్చున్న వైపు తలుపు తీశాడు డ్రైవరు రంజన్. కారు ఆగిందో లేదో అప్పుడే ట్రాన్సిస్టర్ ఏరియల్ పైకిలాగి కిటికీలోనుండి అవతలికి పెట్టి వడిపి తమ్ముడు మధు స్విచ్ వేశాడు. మొహబ్బత్ ఏవిధంగా మనస్సును అల్లరిపెట్టి తికమకలు చేస్తున్నదో వివరించే హిందీ సినిమా పాటొకటి స్త్రీ కంఠస్వరంతో తారా స్థాయిలో మ్రోగడం మొదలుపెట్టింది. కుడిచేతి వైపున వెనక సీట్లో చివర కూర్చున్న చిన్నతమ్ముడు సుధాకర్ హడావిడిగా తలుపు తీసుకు దిగి అటూ ఇటూ చూస్తూ ఎక్స్‌ప్రెస్‌ను మించిన వేగంతో అడుగుతున్నాడు: 'ఇక్క...ఇక్క...డేనా, ఎక్క...ఎక్క...ఎక్కడ, ఆ తో...తో...తోటా, మేడా?' వాడికి నత్తి లేకపోయినా తొందరమీద మాట్లాడ్డంలో ప్రతీ మాటలోనూ కొన్ని అక్షరాలు పునరుచ్చరిస్తూ ఉంటాడు. అమ్మ అంది సుధాకర్‌తో: 'ఎందుకా తొందర మధూ? కుడిచేతివైపు తలుపుతీసి రోడ్డు మీదికి దిగకూడదని ఎన్నిసార్లు చెప్పారు నాన్న నీకు?'

నాన్నకూ డ్రైవరకూ నడుమ కూర్చున్న పెద్ద తమ్ముడు రాధాకృష్ణ విసుగుగా వెనుకకు మధువైపు చూసి రేడియో ఆపమని సైగ చేశాడు. నాన్న దిగుతుండగా, మధు నాలుక కరుచుకుని రేడియో ఆపి తానూ దిగాడు. నాన్న తరువాత రాధాకృష్ణ, వెనుక సీట్లోంచి నేనూ, అమ్మా, చెల్లి విరజాజీ అందరం దిగాము. నాన్న కారు ముందుకు వెళ్లి బోనెట్‌మీద చేయి వేసుకు నిలబడి కుడిచేతివైపున నల్లని పొగలు ఆకాశంలోనికి వదులుతున్న ఒక బియ్యం ఫాక్టరీ వైపు చూస్తూ కొద్ది క్షణాలు మౌనంగా నిలబడ్డారు. ఆయన ప్రక్క నిలబడ్డ అమ్మకూడా తానూ ఆవైపే చూస్తూ నిలబడింది. సుధాకర్ అమ్మచేయి పట్టుకుని లాగుతూ అడిగాడు 'ఏది...ఏదమ్మా ఆ తోట...తోట?'

నేనూ రాధాకృష్ణ, అమ్మా నాన్నల వెనుకగా నిలబడ్డాం. మధు వెళ్లి రోడ్డు ప్రక్క ఒక నేరేడు చెట్టుమ పరీక్షగా చూస్తున్నాడు— ఈ బుతువులో కాచిన ఊదారంగు పళ్లు, పిల్లల బారినుండి తప్పించుకున్నవి, ఇంకా ఏమన్నా మిగిలి ఉన్నాయా అని. చెల్లి వెళ్లి రోడ్డు అంచుల్లో ఒక గడ్డిపూవుమీద వ్రాలిన సీతాకోక చిలుకను కొద్ది దూరంనుండి చూస్తున్నది పరిశీలనగా. వాటిని పట్టుకునే వలా, జైలాలు సీసా, దూదీ, స్పెసిమెన్స్ సంగ్రహించి పెట్టుకునే పెట్టె దగ్గర ఉంటే విరజాజి ఆక్షణమే దాన్ని పట్టుకుని నాకు అప్పగించి ఉండేది.

కళ్లు ఫాక్టరీమీదినుండి మరల్చకుండానే నాన్న సుధాకర్ అడిగిన ప్రశ్నకు జవాబుగా అన్నారు: 'లేదు. ఆ తోటా, మేడా అన్నీ పోయాయి. నలభై ఏళ్ల క్రిందట నేను పుట్టినప్పుడే పురాతనంగా ఉండేవి ఇంకా ఉంటాయా? ఆ ధాన్యం బస్తాలు కనిపిస్తున్నాయి కదూ? అక్కడే ఉండేది నేను పుట్టిన గది. ఆ ప్రక్కనే గది కిటికీదగ్గర జామచెట్టొకటి ...ఆ జామచెట్లు, మల్బరీచెట్లు, మామిడి చెట్లు, మందార, పున్నాగ, నందివర్ధనం మొక్కలు, గులాబీచెట్లు, రాధామనోహరం నైట్‌క్వీన్ తీగలు అల్లిబిల్లిగా అల్లుకుపోయి ఇంటిముందర ఆ పూల ఆర్చరూ,...అన్నీ, అన్నీ పోయాయి!'

నెమ్మదిగా రాధాకృష్ణ అన్నాడు: 'పడి

పోయి ఉంటుందా ఇల్లు. ఈ స్థలమంతా ఎవళ్ళో కొనుక్కుని మిల్లు పెట్టినట్టున్నా రిక్కడ.' మామూలుగా ఎక్కడా సెంటిమెంట్ అన్న దానికి తావు లేకుండా నిజం నిజమే అన్నట్టుగా మాట్లాడేవాడు కూడా ఈవేళ నాన్నపట్ల అభిమానం సానునయం తన గొంతులో ప్రస్ఫుటం చేస్తూ అన్నాడు ఆ మాటలు. ఆ ఫాక్టరీ వెనుక ఒక చిన్న కొండలా లేచిన ఊకకుప్పను చూస్తూ నాన్న అన్నారు: 'అవును-పడిపోయి ఉంటుంది. దానికాలం అయిపోయింది' ఆగి జాలిగా నవ్వి వెనుకకు తిరిగి అన్నారు. 'పదండి, వెళ్దాం'

కారు మళ్ళీ బయల్దేరి ఒక మైలు దూరం వెళ్ళిన తరువాత కుడిచేతి వైపున ఒక పెద్ద ఇంటి దగ్గర మళ్ళీ దిగారు నాన్న. గేటు దగ్గరకు వెళ్ళి అక్కడ ప్రక్కను స్తంభంమీద ఉన్న ఇత్తడి అక్షరాల ప్లేట్‌వైపు ఆయన చూస్తూండగానే నేనూ రాధాప్రష్నా కూడా దిగాం. అమ్మ మటుకు దిగకుండా అలాగే కూర్చుండి పోవడంవల్ల విరజానీ ఈసారి కుడివైపు నుంచి దిగకూడదని జ్ఞాపకం ఉంచుకున్న సుధాకర్ దిగడానికి వీలు కాలేదు. నేనూ వెళ్ళి ఆ ప్లేటు చూశాను. 'ఎం. రాములు, ఎం. ఎల్. ఏ' అని ఇంగ్లీషులో ఉంది దానిమీద.

'ఇతడేనమ్మా నేను చెప్తుండే బాబులు. ఆ రోజుల్లో అందరమూ అలాగే పిల్చే వాళ్ళం. చిన్నప్పటినుంచీ కలిసి చదువుకున్నాం. ఎమ్మెల్యే అయ్యాడిప్పుడు. ఉన్నాడేమో చూస్తానుండు.' అంటూ నాన్న గేటు తీసుకుని లోపలకు వెళ్తూ నేను అక్కడే నిలబడ్డాను.

ఆ లోపల వరండామీద ప్రక్కగా కట్టి ఉన్న ఆల్సేషియన్ మొగకుక్క భోయ్‌భోయ్ మని భయంకరంగా అరవడం మొదలు పెట్టింది. రెండో ప్రక్కను కట్టి ఉన్న దాని జోడీ ఆడకుక్క మటుకు నాలుక జాపుకుంటూ ఎగ ఊపిరితీస్తూ వచ్చిన మనిషి తన్ను లాలిస్తాడేమో అన్నట్టుగా గొలుసులను వదిలించుకుని ఎగబడడానికి ప్రయత్నిస్తున్నది. లోపలినుంచి ఒక ఇరవై ఏళ్ల లమ్మాయి గుమ్మం దగ్గరకు వచ్చి, ఎర్ర నిలువు చారలు తెరలు ప్రక్కకు తొలగించి అడిగింది.

'ఎవరండీ?'

'బాబులు లేరమ్మా?'

'బాబులా? ఎవరు? ఇక్కడెవరూ బాబులు లేరండి.'

'అతడేనమ్మా రాములు...'

'ఓహో, నాన్నగారా? లేరండి. హైద్రాబాదు వెళ్ళారు.'

'రాములు అమ్మాయివా నువ్వు! నీపేరేమిటమ్మా?'

'సుజనమణి అండి.' అక్కడ కుర్చీలు చూపెడుతూ అంది: 'కూచోండి.'

'మీ నాయనమ్మగారున్నారా లోపల?

సుజనమణి వింతగా చూసి అంది: 'ఆవిడ నా చిన్నప్పుడే స్వర్గస్థులై పోయారండి. మీ రెవరండి?'

'నేనూ మీ నాన్నా చిన్నప్పుడు కలిసి చదువుకున్నామమ్మా. సుబ్బారావు అంటారు నన్ను. రేంజరుగారి తోట ఉంది కదూ అక్కడే ఉండేవాళ్ళం. చాలా ఏళ్ళ క్రిందటి సంగతిలే.'

'రేంజరుగారి తోటా? ఎక్కడండి?'

'ఇప్పుడక్కడ బియ్యం ఫాక్టరీ ఉంది.'

'ఓహో, అదా?' అంటూ సుజనమణి పైకి వచ్చి నమ్మా, రోడ్డుపక్క కారుమా, తక్కిన వాళ్ళనూ చూసి అంది: 'అందర్నీ లోపలికి రమ్మనండి, కూర్చోండి. అమ్మ ఆస్పత్రి కెళ్ళింది. తమ్ముడు స్కూలుకు వెళ్ళాడు. ఇంట్లో మరెవ్వరూ లేరు, నేనూ పనిమనిషీ తప్ప...'

'ఎప్పుడొస్తారు నాన్నగారు?'

'ఈ నెలలో మరి రారండి. కుటుంబంలో వచ్చినట్టున్నారు. అందర్నీ రమ్మనండి లోపలికి. కాఫీ తాగి వెళ్దురు గాని'

'థాంక్స్...వద్దమ్మా ఎంతమంది మీరు బాబులు—రాముడికి పిల్లలు?'

'నేనూ తమ్ముడు రఘునందన్ ఇద్దరమేనండి. నాన్నగారు ఆపరేషన్ చేయించుకున్నారు.'

ఆ అమ్మాయి చొరవగా జంకకుండా అలా మాట్లాడడం నాన్నగారికి ఆశ్చర్యం కలిగించి ఉంటుంది. కాని పైకి మటుకు అది కనిపించకుండా అడిగారు:

'మీరేం చదువుతున్నారమ్మా?'

'పియూసీ పాసై మానేశానండి' తల వంచుకుని అంది. 'వివాహమై పోయింది ఈయేడే. తమ్ముడు ఫిఫ్త్‌ఫారం అండి. కూర్చోండి నిలబడే మాట్లాడుతున్నారు.'

కావైపు చూసి మెట్ల దగ్గరకు వచ్చి నిండుగా నవ్వుతూ అంది: 'రామ్మా లోపలికి. అమ్మగార్ని అందర్నీ రమ్మను.'

నేను చిరునవ్వు నవ్వి నాన్నవైపు చూశాను. నాన్న అన్నారు: 'లేదమ్మా ఇంకా చాలా పనుంది. చాలా సంతోషం బాబులు కుమార్తెను చూడగలిగినందుకు. నేను వెళ్ళి ఉత్తరం రాస్తానని చెప్పు నాన్నగారికి. ఏ. సుబ్బారావు అంటే తెలుస్తుంది. వస్తామమ్మా.'

'మంచిదండి నమస్కారమండి.'

కారు నడుస్తుండగా వాళ్ళ సంగతి అమ్మకు చెప్పి నాన్న అన్నారు:

'అప్పుడు ఫోర్త్‌ఫారం చదువుతున్నప్పుడు ఇక్కడే ఆ తోటలో ఉండే వాళ్ళం. రోజూ బాబులూ నేనూ కలిసి మధ్యాహ్నానికి భోజనం టిఫిన్ కారియర్లలో పట్టుకుని నాలుగు మైళ్ళు నడిచి ఇస్నీసుపేటలో హైస్కూలుకి వెళ్ళేవాళ్ళం. వాళ్ళు హరిజనులు కదూ? వాళ్ళమ్మ నాకు మంచి నీళ్ళు కూడా ఇచ్చేది గాదు. 'ఏ జన్మలో ఏం పాపం చేసుకున్నామో ఈ జన్మలో ఇలా జన్మించాం. మీలాటోరికి మాచేతి నీళ్ళిచ్చి మరింత పాపం తెచ్చుకోలేము!' అనేది ఆవిడ. స్కూల్లో మటుకు అక్కడ మైదానంలో నేనూ బాబులూ ఒకళ్ళ కారియర్లు ఒకళ్ళు పంచుకుని తినేవాళ్ళం. నేను మాంసం అదీ ముట్టుకునేవాణ్ణి కాదుగాని అప్పడాలూ, ఆవకాయి, వేపుడుకూరలూ తినేవాణ్ణి. వాడు తినడానికి నా కారియర్లో ఎక్కువ ఏదీ ఉండేది కాదులే! పులుసన్నమూ మజ్జిగా అన్నమూ తప్ప. మా అమ్మ చేసిన కొబ్బరి పచ్చడంటే వాడికెంతో ఇష్టం!'

అమ్మ నవ్వి అంది: 'ఇప్పుడు వేపుడు కూరలు చేస్తే సహించవంటారు! మరి చూడండి, మీ స్నేహితులేమో వాళ్ళ ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేసేస్తుంటే మీ రింకా ముద్దుగా మీ అమ్మాయిని ఎం. ఎస్సీ. చదివిస్తున్నారు, చీమ కుట్టినట్టుగాకూడా లేకుండా!'

నాన్న చిరునవ్వుతో నావైపు చూశారు. నేను నవ్వుతూ అన్నాను:

'నేను చదువుకుంటే మధ్యను నాన్నెందుకు కుట్టాలి చీమలు?'

'ఎబ్బే, మీ ఇద్దరినీ కుట్టను. నన్నే

పునస్కారాలు చెయ్యడంగాని అలవాటు లేని నాన్న ఆ కోవెలకి వెళ్లడమూ, గంటలు వాయించడమూ, ఎర్రని సింధూరం తాను పెట్టుకుని మమ్మందర్నీ పెట్టుకో మనడమూ, కొబ్బరి కాయలు కొట్టించడమూ—ఇవన్నీ నాకు ఆశ్చర్యం కలిగించాయి.


పైకి వచ్చాక నాన్న అన్నారు: 'మామయ్య ఇంట్లో ఉండడానికి అవకాశం లేక రెండేళ్లు మిడిల్ స్కూల్లో చదువుతున్నప్పుడు ఆర్యాపురంలో మా పిన్ని గారింట్లో ఉండేవాణ్ణి. ప్రతిరోజూ సాయంత్రం ఇక్కడికి వచ్చేవాణ్ణి. ఒక ముసలి ఆవిడ రోజూ వచ్చేది ఆ వేళకే. ఆవిడ తన చేతిలో ఉన్న దేవుడి ప్రసాదపు చిప్పల్లో ఒకటి నాకిచ్చేది, నా మొహంమీద మెడమీదా ఎర్రని సింధూరం కనిపించకపోతే ఆ కొబ్బరిచిప్ప దొరకదేమోనని ఆవిడ కోసం ప్రతిరోజూ ఆ బొట్టు పెట్టుకునే వాణ్ణి. ఒక్కొక్కరోజు నేను కనిపించక పోతే ఆ మర్నాడు అడిగేది ఆప్యాయంగా: 'నిన్న రాలేదేం నాయనా? ఒంట్లో బావు లేదా?' అని... అప్పటికే అరవైపైబడింది ఆవిడకి. ఈ లోకంలోనో, ఏ లోకాల్లోనో ఎక్కడ ఉందో ఆ తల్లి ఇప్పుడు! ఎక్కడ ఉన్నా ఆవిడ సంతృప్తికోసం, ఆవిడకు నా కృతజ్ఞత చూపించి ఋణం తీర్చుకోవడంకోసం. వచ్చినప్పుడల్లా ఇక్కడికి వస్తాను. ఆ కొబ్బరి చిప్పలలోని ప్రోటీన్లూ, విటమిన్లూ, షుగరూ, ఆనాడు నా ప్రాణం నిలబెట్టడంలో చాలా ఉపకరించాయి!'

గోదావరి గట్టున కొంతదూరం వెళ్లి అక్కడ ఒకచోట మెట్టుమీద కూర్చున్నాం అందరమూ. సుధారాణి విరజాజిని నీళ్లలోకి దిగనివ్వకుండా తన దగ్గరే కూర్చో బెట్టుకుంది అమ్మ. పాపికొండల లోనో ఇంకా ఎగువనో పెద్ద వానలు పడ్డాయి కాబోలు, గోదావరి బుసలు కొడుతూ పారుతూంది, నిండుగా నురగలతో, మహాఘోర ఘోషతో. నాన్న అన్నారు ఆ నీళ్లవైపు చూస్తూ: 'ఒక్కొక్కరోజు కటిక ఉపవాసంలో ఉన్న కడుపుతో వచ్చి ఇక్కడ కూర్చునే వాణ్ణి—గంటల తరబడి. వెనుకన్న అవమానాలూ, ఛీదరింపులూ, నిరసనలూ, నిరాదరణలూ, అన్నీ చెప్పుకునేవాణ్ణి ఈ గోదావరి తల్లితో. మౌనంగా అలల గలగలలతో ఏవో గుసగుసలతో ఓదార్చేది ఆ రోజుల్లో ఈ తల్లి అనాథుడైన నన్ను. ఆ చివరి మెట్టుమీద నీళ్లలో కాళ్లు పెట్టుకుని కూర్చున్నప్పుడు ఏవేవో ఉపశాంతి కలిగించే చల్లని మాటలు వినబడేవి.' ఆగి నిండుగా ఊపిరి తీసి వదిలి అన్నారు ఆయన: 'ఆ గలగలలూ ఆ చల్లని మాటలూ వినబడటం లేదిప్పుడు. ఏదో కొత్తగా అనిపిస్తోంది. నాకూ ఈ గోదావరికీ ఏమి సంబంధం అనుబంధం ఉన్నట్టు అనిపించడం లేదిప్పుడు. నాతోనే కాదు, ఎవళ్లతోనూ ఏ అనుబంధమూ ఉన్నట్లు కాదు ఈ నదికి ఇవాళ! ఎంత నిర్లక్ష్యంగా పారుతుందో!' ఆగిపోయి దూరాన ఎక్కడో ఆకాశంలో చూస్తూ అన్నారు ఆయన: 'చినదుడు చింకి బట్టలతో, నూనె కూడా రాసుకునే భాగ్యంలేని చింపిరి జుట్టుతో, నడిచి నడిచి కదుములు కట్టిన జోళ్లులేని కాళ్లతో, పెన్నులు అప్పుడప్పుడూ ముట్టుకునే అదికాలమే లేక ఒంటినిండా సిరాబుడ్డీలతో రాయడంవల్ల చేతినిండా వేళ్లనిండా సిరా మరకలతో వచ్చి తన కాళ్లదగ్గర తలపెట్టుకుని ఏడ్చిన ఒక అనాథ బాలుడు ఇవ్వేళ కొత్త కారులో, ఇంత పెద్ద సంసారంతో, పెద్ద పెద్ద చదువులు చదువుతున్న పిల్లలతో, తన జిల్లాలో లోకుల్ని అందర్నీ ఎన్నోవిధాల శాసించే అధికారంతో, ఇంత అందకత్తె, అనుకూలవతి, సుగుణవతి అయిన భార్యతో మళ్లీ వచ్చి తన కాళ్ల దగ్గర కూర్చుని ఉన్నాడన్నది స్పృహ ఉన్నట్లు లేదీ నదికి!' గట్టిగా నిట్టూర్చారు ఆయన:

'ఈ గోదావరి తల్లి మర్చిపోయింది నన్ను! ఈనాటి ఇలా ఉన్న నన్ను చూసి మనస్ఫూర్తిగా సంతోషించి దీవించేవాళ్లు ఎవరూ లేరు ఈ ఊళ్లో!'

ఎప్పుడూ ఏమీ అనరేం. ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని నాన్న ఇలా అనడం చూసి ఆశ్చర్యంతో రెప్పవేయకుండా కళ్లప్పగించి చూస్తున్నాను. సుధారాణి కూడా ఆ మనిషి. మనస్ఫూర్తిగా తన గురించి నాన్న అన్న మాటలు ఎంతో సంతృప్తి కలిగించినా, ఆయన మనస్సులోని ఆరాటం అర్థం చేసుకున్న అమ్మ మొహంమీద సానుభూతి కనబడుతోంది. కొంతసేపు మౌనంగా గడిచాక రాధాకృష్ణ అన్నారు: 'ఎప్పుడైనా కాలాన్నిబట్టి ఎక్కువగానో తక్కువగానో అలా పోటు పాటూ ఉంటూనే ఉంటాయి. అది మనతో సంబంధం లేనట్టుగా కనబడినా అప్పటి పాత మనిషి ఉన్నా ఉంటాడని బట్టి...'

ఇంకా ఏమో అనబోతే రాధాకృష్ణ అమ్మ మందలించినట్టుగా పెదవులు బిగించి కనుబొమ్మల సైగతో ఆగిపోయారు. అమ్మ అంది దూరంగా ఏపాల వెలుగుల్లో పొటమరిస్తూన్న స్టీము లాంచి ముందు మెరుస్తున్న అలలని చూస్తూ: 'ఎంత బావుందో ఆ పడవ!'



నాన్న అటు చూసి అన్నారు: 'చాలా బావుంది!'

అమ్మ అంది: 'మధ్యాహ్నం చెప్పారు మీ చిన్నతనంలో చిలకలమ్మే గడ్డపు మనిషి ఎవడో ఇక్కడెక్కడో ఈ గోదావరి గట్టునే ఉండేవాడని? పదండి చూదాం. చిన్నప్పుడు మీరు తిన్న వాడి చేతి పంచదార చిలక తినాలనిపిస్తోంది నాకు కూడా!'

నాన్న నవ్వి అన్నారు: 'ముప్ఫయి అయిదేళ్ళ క్రిందటి సంగతి! వాడు అప్పుడు పాతికేళ్ళవాడు. వాడిల్లు నాకు తెలుసు. పదండి, చూద్దాం, ఉన్నాడేమో వాడు.'

అతన్ని చూశాం వెళ్ళి మేము. ఆ చిలకలబ్బి ఇప్పుడు అరవై దాటిన ముసలివాడు. అప్పుడు చూసినట్లుగానే ఉంది గాని ఇల్లు కూడా ఏమీ మారలేదని అన్నారు నాన్న. చాలా ఏళ్ళుగా చిలకలమ్మే వ్యాపారం మానేశాడట. ఇప్పుడు వాళ్ళ ఇంటి ముందు ఒక లారీ ఉంది. దాని కింద దూరి అతని కొడుకుట, ఏదో బాగుచేస్తున్నాడు లాంతరు వెలుగులో. ఎవళ్ళో షావుకారు దగ్గర డ్రైవరుగా ఉన్నాడట అతడు.

ఆ చిలకలబ్బికి కళ్ళు పూర్తిగా కనపడటంలేదు ఇప్పుడు. అతని జ్ఞాపకం తెప్పించడానికి నాన్న చెప్పిన మాటలన్నీ జాగ్రత్తగా విని, జాలిగా అన్నాడు, తెల్లని గడ్డం మీసం తడుముకుంటూ: 'ఏటో బాబయ్యా! తమరి పేరూ అదీ, ఎవరో ఏటో ఏదీ గెర్తొస్తంలేదు. పెద్ద వయస్సై మతి కూడా సరిగ్గా నిలవదు. కాని తమరివన్నీ సెప్తుంటే మళ్ళీ ఆ రోయిలా పొచ్చీను వాయిసులో బెండుకర్రకి పంచదార సిలకల పుల్లలు గుచ్చుకోని, కంచుగంట వాయిత్తూ పాట పాడుతూ వీదులన్నీ తిరగడం మొన్నటికి ఇప్పుడే అయిన్నీ అవుతున్నట్టుగా అనిపిత్తున్నాది!' అని కళ్ళుమూసుకుని ఏదో తృప్తిగా చిరునవ్వు నవ్వుతూ నీరసమైన గొంతులో రాగ ధోరణిలో పాడటం మొదలుపెట్టాడు తాత.

'ఒన్నె ఒన్నెల సిలకండీ!
ఒయ్యారాలా కలికండీ!
జిలిబిలి పలుకుల సిలకండీ!
జిగిబిగి కులుకుల కలికండీ!'

# గోదావరి ...

లారీ క్రింద పనిచేస్తున్న వ్యక్తి తల ఇవతలికి తీసి పైకెత్తి తండ్రిని చూస్తూ నవ్వుతూ అన్నాడు: 'ముసిలోడియాల మంచి ఉసారుగా పాడుతున్నడే!'

తాత పాట ఆగిపోయింది మధ్యలో. కళ్ళు తెరిచి జాలిగా అన్నాడు: 'ఏటో బాబయ్యా! అయిపోయాయి ఆ దినాలూ పాటలూ! తమరింకా సిన్నోరు. నాలుగు కాలాలపాటు నా పంచదార సిలకలగెప్తి తమ మనస్సులో అలాగే నిలవాలని దీయిత్తున్నాను — తమరెంత పెద్ద లెక్కటర్లు అయినా వాయిసులో పెద్దోణ్ణే కనుక! సుకంగా ఉండండి బాబయ్యా, తమరూ, అమ్మగారూ, పిల్లాజెల్లా అందరూ! మన ఆంధరాకి గవినేరుగా రావాలి తమరు!'

నాన్న కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి, అక్కడ వెలుగుతున్న లాంతరు కాంతిలో తళతళలాడుతూ. సరుద్దని పర్సులో నుండి పదిరూపాయల నోటు ఒకటి తీసి అతని ముందుంచి నమస్కారం పెట్టి: 'వస్తాను తాతా!' అని లేచారు. తాత వణుకు గొంతులో అన్నాడు: 'డబ్బా? వొద్దు బాబయ్యా! వొద్దు. ఈ పాపిష్టి డబ్బు కోసమని దీయించలేదు తమని.'

'లేదు తాతా. చాలాసార్లు నీ దగ్గర చిలకలు అరువుగా తీసుకున్నాను తరువాత డబ్బిస్తానని. ఎవళ్ళు ఎంతివ్వాలో లెక్కా పత్రం పెట్టుకోని నువ్వు నన్నెప్పుడూ నిలబెట్టి అడగలేదు. ఇద్దామని ఉన్నా నా దగ్గర ఉండేది కాదు ఆ రోజుల్లో! ఆ బాకీ వడ్డీతో కలిపి ఉంటుంది. ఈవాళ తీర్చుకుంటున్నాను నీ ఋణం.' కళ్ళజోడు తీసి కొనగోటితో కనుకొలకుల్లో కూడుకున్న నీటిని తుడుచుకుంటూ వడివడిగా కారువైపు నడిచారు నాన్న.

గౌతమీ లాడ్జింగ్స్ వైపు కారుని పోనీమన్నారు ముందు ఆయన. కాని మళ్ళీ ఒకచోట ఆపి డ్రైవరుతో ఇంగ్లీషులో అన్నారు: తిన్నగా ఈ ఎడమచేతి వైపు వెళ్ళి మెయిన్‌రోడ్ అందుకో, రంజన్. ఉదయం చూశాం పెద్ద స్టేషన్, అక్కడికింకా ఇవతలే అరమైలు దూరంలో ఒకళ్ళ ఇంటికి వెళ్ళాలి.'

అమ్మ అడిగింది: 'ఎవళ్ళ ఇంటికి?'

'పొద్దున్న వస్తున్నప్పుడు చెప్పానుగదూ? అరికట్లు తోటలో రాములవారి గుడి దగ్గర... అక్కడ ప్రైమరీ స్కూల్లో మూడో క్లాసు చదువుకున్నానని? ఆ రోజుల్లో నాతోపాటు చదువుకునేది గౌరి అని ఒక అమ్మాయి. పిడకల వ్యాపారం వాళ్ళది. ఆ పిల్లని చూద్దాం ఒకసారి.'

అమ్మ జాలిగా నవ్వి అంది: 'ఏనాడో పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయి ఉంటుంది. ఆ అమ్మాయి! మీకిప్పుడు కనిపిస్తుందా నలభై ఏళ్ళ క్రిందటి పిల్ల?'

'లేదు. టౌండైతామి మ్రదిపాళ్ళ అక్కడే ఉంటుంది. అప్పటికే పెళ్ళయిపోయింది గౌరికి. ఇల్లరికం అల్లుడు. రాములవారి గుడిదగ్గర గౌరి వాళ్ళనాన్న పెట్టిన కిళ్ళీ దుకాణంలో కూర్చునేవాడు వాడి మొగుడు. నాకన్న నాలుగయిదేళ్ళ పెద్ద. వాళ్ళిల్లు ఒక పెద్దమేడ. బహుశా ఇప్పుడూ అక్కడే ఉండి ఉంటారు వాళ్ళు. గౌరి, నేనూ, వాడూ కలిసి మిట్ట మధ్యాహ్నం పూట ప్రతి రోజూ తొక్కుడు బిళ్ళ, గచ్చకాయలతో ఆడుకునే వాళ్ళం. గోటీ బిళ్ళా కర్రా, గోళీకాయలూ కూడా ఆడేవాళ్ళం అప్పుడప్పుడూ. చాలా మంచి వాడు లచ్చన్న అని! ఎంత స్పోర్ట్స్‌మన్ స్పిరిట్ ఉండేదో వాడికి! గౌరి నేనూ కలిసి వాణ్ణి ఓడించినా ఎప్పుడూ ఉడుక్కునే వాడు కాడు.'

నాన్నకు ఆ వీధీ, మేడా, జ్ఞాపకం ఉండడాన్ని బట్టి ఆ ఇల్లు సులభంగానే కనుక్కున్నాం. కాని అతని పేరు లక్ష్మణస్వామి అని మార్చుకున్నాడు. ఆ దగ్గర ఊళ్ళో బ్యాంకు పనులతో కంట్రాక్టరుగా ఉంటున్నాడు ఇప్పుడు. ఒక మోటారు సైకిలు కూడా ఉంది అతనికి.

రెండంతస్తుల మేడ అది. ఎరుపూ, పసుపూ, నీలి, ఊదా, ఆకుపచ్చ రంగులతో ముందు భాగం అంతా కొట్టవచ్చినట్లుగా కనబడుతోంది, ముగ్గులూ, గీతలూ, స్వస్తికలూ మొదలైన డిజైన్లతో. ముందు వరండా ముదర నారింజ రంగులతోనూ, లోపలంతా నీలి ఆకుపచ్చ రంగులతోనూ గోడలన్నీ డిస్టెంపర్ అయి ఉన్నాయి. రెండో అంతస్తుపైన

(68 వ పేజీ చూడండి)

# గోదావరి ...

(38 వ పేజీ తరువాయి)

డాబా పిట్టగోడమీద. వెనుక బల్బులతో తిరుగుతున్న సుదర్శన చక్రం ఉన్న రాధాకృష్ణుల బొమ్మ ఉంది. ప్రక్కల ఉన్న గోడలకూ, కాంపౌండ్ గోడకూ పిడకలు తట్టి ఉన్నాయి చాలా. వాటి బరువైన వాసన ఆ ముందు వాతావరణం అంతా నిండి ఉంది. ఒక ప్రక్కను లాటాకుల పాకలో ఆరేడు ఆవులూ, గేదెలూ, నాలుగైదు దూడలూ ఉన్నాయి. ముందు వంకుల గోడమీదా డాబాపిట్ట గోడమీదా రకరకాల పూల మొక్కలు కుండీలలో ఉన్నాయి.

మేము అక్కడికి చేరుకునే టప్పటికి దంపతు లిద్దరూ ఇంట్లోనే ఉన్నారు. వాళ్ళకు సంతానం లేకపోవడాన్ని పిల్లల సందడి లేదు ఆ ఇంట్లో.

గౌరికి ఇంచుమించు నాన్న వయస్సే. లేక అంతకన్న రెండు మూడేళ్ళు ఎక్కువే ఉంటుంది. పచ్చగా పబ్బపండులా ఉన్న శరీరచ్ఛాయతో భారీగా, అంత ఎత్తుగా, నుదుట పెద్ద కుంకుమ బొట్టుతో, మెడ తిరగని నగలతో, నున్నని పెద్ద కొప్పులో తురుముకున్న మల్లె పువ్వు చంద్రకాంతం పూలదండలతో, ... కన్నెస బంగారు రంగు గంధం పూసి, ... నేసిన వజ్రవరికిణీతో ... ముదర ఆకు పచ్చ పూల పూల ఫోర్‌వాయిల్ చీరతో, జరీ అంచున్న ముదర నీలి రంగు జాకెట్టుతో, కాళ్ళకు ... అందెలతో, చేతులకు నిండా నీలి ఆకు పచ్చ గాజులతో... క్యాలెండర్లలో కనిపించే లక్ష్మీదేవి పార్వతీదేవి బొమ్మల ను స్మరింప చేస్తున్నది ఆవిడ. ఆవిడ ప్రక్క అమ్మ నిల్చుంటే గంభీరంగా ఉన్న ఒక పెద్ద కొండ ప్రక్కను పార్కులో కృత్రిమంగా కొండపోలికలో తయారుచేసి పూల మొక్కలు పెంచిన చిన్న గుట్ట పెట్టినట్లుగా ఉంది నాకు. బుగ్గలలోనూ కళ్ళల్లోనూ చిందులాడే నవ్వులు చూస్తూంటే తానే ఒక తీయని కలగా జీవితంలో ఆవిడ తేలుతున్నట్లుగా అనిపించింది నాకు.

మా కారు వాళ్ళింటి ముందు ఆగగానే వాళ్ళు నిలుచుపోయి ఎవరా అని ముందు చూసినా ఫలానా అని నాన్న తన పరిచయం చేసుకోగానే — చిన్నప్పుడు తనను అందరూ పిలిచే 'పొట్టయ్య' అనుమాట చెప్పగానే—వెంటనే గుర్తుపట్టి ఎంతో పొంగిపోయి మమ్మలను అందరినీ ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించారు వాళ్ళు. లక్ష్మణస్వామి నాన్నను కౌగలించుకుని 'నువ్వురా పొట్టీ! ఎవరో అనుకున్నాను! ఇంత పెద్దవాడివయ్యావా? ఎన్నాళ్ళయింది నిన్ను చూసి! వెరీగుడ్! చాలా సంతోషంగా ఉందిరా!' అంటూంటే మా అందరికీ ఎంతో నిండుగా అనిపించింది. మమ్మును మొదట ముందు వరండాలో కూర్చుబెట్టి కాఫీ, బిస్కట్లూ, బత్తాయి పళ్ళూ ఇచ్చారు వాళ్ళు. ఆ తరువాత గౌరీదేవి మమ్మును తీసుకువెళ్ళి ఇల్లంతా స్వయంగా చూపించింది. సాంబ్రాణివత్తుల వాసనలు ఆలోపల అంతా దట్టంగా అలము కుని ఉన్నాయి అన్ని గదుల్లోనూ లేత నీలి రంగులో ట్యూబ్‌లైట్లు వెలుగుతున్నాయి గోడలనిండా టేకు బద్దీలమీద ముక్కోటి దేవతలలో పేరున్న ముఖ్యమైన దేవుళ్ళందరి బొమ్మలూ, రకరకాల రంగుల చిత్రపటాల్లో ఉన్నాయి. ఒక గదిలో చాలా ఫోటోలు ఉన్నాయి. ప్లాస్టిక్ పూలూ, లతలూ ప్రాకి ఉన్నాయి అన్నిచోట్లా


దురదని తరమండి!


FDSADL 1274TE

## అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్

ఎక్సిమా • తామర • గజ్జి

వీటిని సురక్షితంగా, శీఘ్రంగా, చక్కగా పోగొడుతుంది.

ఇది అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారింపే అని గుర్తు ఉంచుకోండి



# గోదావరి ...

గోడలమీద. అలాటి వాటిని చూసినప్పుడల్లా మామూలుగా నాకు ఒళ్ళు మంట. అయినా ఆవేళ మటుకు, గౌరీదేవి తన గొంతులోని చైతన్యమూ, చిరునవ్వులోని లావణ్యమూ, పెదవులలోని మాధుర్యమూ, మనస్సులోని మార్దవమూ వాటి అన్నిటిలోనికీ అదృశ్యంగా విద్యుచ్ఛక్తిలా ప్రసరింపజేస్తూ ఉండడంవల్లనో ఏమో ఎంతో సజీవంగా నవనవలాడుతూ హాయిగొల్పుతూ కనిపించాయి. పడక గదిలో డబల్ మంచమూ, చక్కగా పరిచి ఉంచిన పరుపూ, దిళ్ళూ, సిరిరంగు దోమతెరా, రేడియో, శృంగారోద్దీపకమైన కాలెండరు బొమ్మలూ ఉన్నాయి. అటువంటి ఇంట్లో సాధారణంగా ఊపిరి తిరగనట్లు అనిపించవలసినా ఆ రోజు మటుకు గౌరి హృదయ వైశాల్యం దానికీ సంక్రమించి నా మనస్సు ఆకాశంలో పిచ్చుక విడిగా ఎగురుతున్నట్లనిపించింది నాకు. ప్రొద్దుటినుంచీ ఆ ఇంట్లో అడుగుపెట్టేవరకూ బాగా ముడుచుకుపోయినట్లుగా ఉన్న నాన్న కూడా ఎంతో హుషారు నింపుకుని ఒక్కసారిగా నిండుగా విచ్చుకున్న పెద్ద సూర్యకాంతం పూలా అయి, ఏవో చిన్ననాటి కబుర్లు మాట్లాడటం మొదలుపెట్టారు.

మాటల సందర్భంలో అంది గౌరి: 'జ్ఞాపకముందీ పొట్టయ్యా? ఒకప్పుడు ఒకసారి సంక్రాంతికి నా కోసమని ఎర్రటి గాజులు, బంగారు నీరులో వొంకు పొంకుల అంచులు పోసినవి, తెచ్చిపెట్టావు రెండూ? మనిద్దరం హైస్కూల్లో చదువుతున్నప్పుడు? ఏదో స్కూల్లో నాటకంలో వేసిన వేషానికి ప్రయిజుగా వచ్చిన ఎబ్బైపెట్టి దుకాణంలో మార్చేసి తెచ్చానని చెప్పావు? ప్రతి సంక్రాంతికి పైకితీసి ఒకసారి చూసుకుంటూ ఉంటాను, తమ్ముడు పొట్టయ్య చిన్నప్పుడు ఇచ్చినవని! నా బొట్టుపెట్టెలో అడుగున ఉన్నాయి, చూపిస్తాను పద!'

నాన్నను లోపలికి తీసుకువెళ్ళింది ఆవిడ. అమ్మ మొహం చూశాను. ఎక్కడా అసూయ అన్న దాని జాడ కూడా కనిపించలేదు. నాన్న మనస్సు సంతోషంగా ఉన్నందుకు అమ్మ మనస్సూ తేలిగ్గా హాయిగా అయినట్లనిపించింది నాకు. లక్ష్మణస్వామి వైపు చూశాను. అతడు రాధాకృష్ణతో రెయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ గురించి ఏదో మాట్లాడుతున్నాడు. ఆ విషయంలో బాగా మునిగిపోయి, ఇంజనీర్లకన్నా కూడా బాగా తెలిసినట్లుగా అతడు మాట్లాడాడని ఆ తరువాత రాధాకృష్ణ చెప్పాడు. నాకనిపించింది — చదువుకున్నాం సంస్కారవంతులం అనుకునే నరసింహంగారిలాటి వ్యక్తులకన్నా ఎన్నో రెట్లు పై అంతస్తులలో ఉన్నాడు అతడు అని. ఇద్దరికీ ఎంత భేదం!

ఒక పది నిముషాల్లో తిరిగి వచ్చారు గౌరీ, నాన్నా. ఎంత చెప్పినా వినకుండా మమ్మల్ని భోజనానికి ఆ రాత్రి అక్కడే ఉంచేశారు వాళ్ళు.

'బ్రాహ్మళ్ళు మీరు పొట్టయ్యా! అందుకని అయ్యరు హోటలునించి తెప్పించాం భోజనం.' అని చిలిపిదనం కళ్ళల్లో చిందులాడగా అంది ఆమె: 'అక్కడే వాళ్ళు చేసినా, ముందు పెద్ద బోర్డుంది కదా బ్రాహ్మణ భోజన హోటలు అని! అందుకని...'

నాన్న పకపక నవ్వి అన్నారు: 'మాకలాటి పట్టింపులేమీ లేవు! మొదట్లో మొదట్లో మా ఆవిడ పైన వచ్చి మంచి నీళ్ళన్నా ముట్టేది కాదుగాని క్రమక్రమంగా ఇప్పుడు ఎక్కడ ఎవళ్ళు చేసినా సరే ఏమ్మాట్లాడకుండా తినేస్తుంది ఏదన్నా! ఒక్క మాంసం, చేపలూ, గుడ్లూ ముట్టుకోదు అన్నది తప్పిస్తే మరే బాధా లేదు మాకు!'

గౌరి నాలుక కరుచుకుని అంది: 'అన్నన్నా! ముందే అడగవలసింది — అన్నీ చక్కగా నేనే వండి పెట్టేదాన్ని మా పొట్టయ్యకి. వాడి కుటుంబానికీ! మడి వంటకి నేను తగలనే వేరే గిన్నెలూ గరిటెలూ ఉన్నాయి మాకు! సరేలే, మువ్వంకాయ కూరంటే ఎంతో ఇష్టం అంటుండేవాడివి చిన్నప్పుడు చేసిపెడతాను తింటావా? అరగంట ఆలస్యం...అంతే!'

పకపక నవ్వి అన్నారు నాన్న: 'అంత కష్టానా గౌరీ!' అని ఆనందం, బాధా రెండూ పెనవేసుకుపోయి వణికే గొంతుతో అన్నారు: 'నీ కిక్కడ బియ్యం, నువ్విలా లేవు పోనీ నన్ను తరిమేసిన ఈ ఊళ్ళో మళ్ళీ ఈనాడు ఇంత ఆప్యాయంగా అన్నం పెట్టే చేయి కనిపిస్తుందా అనే వెతుక్కుంటూ వచ్చా నిక్కడికి!'

గౌరి రెప్ప వేయకుండా నాన్నవైపు చూస్తూ అంది: 'అదేమిటి పొట్టయ్యా? నీకేమిటి లోటని? చెప్పవూ, లక్ష్మిలా దేవిలాటి భార్యా, రత్నాల్లాంటి పిల్లలూ... వస్తానుండు' ఆమె లోపలికి వెళ్ళగానే అమ్మ కూడా లేచి ఆమె వెనకే వెళ్ళింది.

'నువ్వు' 'ఒరే' అన్న పదాలు నాన్న విషయంలో అంత చనువుగా ఎవ్వరూ ఎప్పుడూ ప్రయోగించడం వినని రాధాకృష్ణకు ఆశ్చర్యంగా అనిపించిందట. కానీ నాకు మటుకూ ఎంతో సహజంగా అనిపించింది ఆ స్నేహమైన ఆత్మీయమైన పిలుపు వింటూంటే. నాన్న ఇలాటి పిలుపులకోసమే తెలుగుదేశం గురించీ తన చిన్నతనంగురించీ మాట్లాడినప్పుడల్లా ఇన్నాళ్ళూ తహ తహ లాడిపోతుండేవారేమో అని కూడా అనిపించింది నాకు. ఈ గౌరీదేవే కనిపించకపోతే ఆ దేశం అంటే ఒక రకమైన ద్వేషంతో, ఎప్పుడూ తీరని నిరాశతో నాన్న ఉండిపోయేవారేమో అనుకుంటాను నేను.

ఎంత ప్రయత్నించినా అమ్మను చేయి పెట్టనీయకుండా గౌరి తానే స్వయంగా చేసిన మువ్వంకాయకూరా, అరటికాయ చిప్సూ, కరివేపాకు పచ్చడీ, సన్నబియ్యం వడియాలూ, అన్నీ సుష్టుగా ఆరగించి రాత్రి ఒంటిగంటకు లాడ్జింగ్సు చేరుకున్నాం.

మూడు గంటలకు మెలకువ వచ్చిన నేను పిల్లలందరమూ పడుకున్న మా గది తలుపు తెరుచుకుని బాల్కనీ మీదికి వెళ్ళాను. అవతల ప్రక్కగది బాల్కనీలో నిలబడి ఉన్నారు నాన్న. ఆకాశంమీద చందమామతో దోబూచు లాడుతున్నాయి మబ్బులు. మెల్లగా అన్నాను: 'చాలా బావుంది నాన్నా ఈరాత్రి!'

చిరునవ్వు నిండుకున్న మొహంతో అన్నారు నాన్న:

'అవునమ్మా, సీతా! చాలా బావుంది. ఎందుకో ఎంతో హాయిగా అనిపిస్తోంది నాకు ఈ నాడు! ఆ చిన్ననాటి గోదావరి మరిచిపోయినా గౌరమ్మకు మరిచిపోలేదు నన్ను!' ●

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.